చెదలు

[కథానిక]

= శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తి =

వెంకాయమ్మగారు చెప్పేటంతవరకూ మా ఇంటి సంగతి నాకు తెలియనే తెలియదు. మా నాన్న-శంకరయ్య-ఆ రోజులలో గజం ఏడు అణాల చొప్పున కొన్నాడు. అప్పుడిదంతా తుమ్మల అడివి. సాయంత్రం అయింతరువాత ఇటు వేపు రావటానికే జనానికి భయం వేసేది. మండువాఇల్లు కట్టిద్దామా, లేక డాబా ఇల్లు కట్టిద్దామా అని చాలారోజులు మథన పడ్డాడు మా నాన్న. ప్రస్తుతం దిట్టమైన గోడలు కట్టి పైన రేల్లు, లేక తాటాకులు ఏర్పరిచి, తర్వాత పెంకులుగాని, లేక డాబాకాని ఏర్పాటుచేసుకో వచ్చునని కొంతమంది సలహాకూడా ఇచ్చారు. అయితే మండువాఇల్లు ఆ రోజుల్లో ఫేషన్ కావటంవల్ల, అదే కట్టించాలని ఆయన తేల్చుకున్నాడు.

ఆ రోజుల్లో ధనికులకు డబ్బు వడ్డీకి ఇయ్యటమో, లేక దివాలాతీసినవారి పొలాలు కొనటమో, లేక గాలీ, వెల్తురూ రాని భవనాలు కట్టించటమో రివాజు. వాళ్లకి సరిపోగా మిగిలిన ద్రవ్యాన్ని ఖర్చు చేసే మార్గం లేదు. అసలు ఎక్కువధనంతోనే అవసరం వుండేది కాదు. తినటానికి తిండీ, కట్టుకోటానికి బట్టా దాటిపొయ్యేది కాదు వారి అవసరాలు. కాక పోతే ఇటు రామేశ్వరమూ, అటు కాశీ వెళ్లి రావటం. కొంతమంది అటువంటివి చేసి వున్నడబ్బు ఖర్చు చేయటం ఇష్టంలేక, బైటవుంచితే దొంగలు ఎత్తుకు పోతారన్న భయంతో ఇంట్లో గొయ్యి తవ్వి, ధనాన్ని పూడ్చి, పైన మంచం వేసుకుని ప్రాణం విడవటం కూడా కద్దు. వడ్డీకి ఇయ్యటానికీ, భవనాల్ని కట్టించటానికీ తాహతు లేదు మా నాన్నకు. తిండికీ, బట్టకూ సరిపోయే అయివేజు వచ్చే భూవసతి వుంది. కాక పోతే నివసించటానికి ఓమాదిరి గృహం లేదు. ఆయన తరంలోనే ఒక గృహం అంటూకూడా ఏర్పాటుచేస్తే ఆయనతర్వాతవారికి ఏ లోపమూ లేకుండాపోతుంది. అందుచేత ఆయన గృహనిర్మాణానికి పూనుకున్నాడు.

"ఏమిటోయి బావా—అడుసుపెట్టి కట్టిస్తున్నావేమిటి ?" అన్నాడు వెంకాయమ్మగారి భర్త.

"ఇప్పటికి ఇలా పోనిస్తూ" అన్నాడు మా నాన్న.

"పిల్లలు గలవాడివికదా, ఇల్లు కొంచెం గట్టిగా వుండద్దూ ?"

"నీకేం బాబూ ! తండ్రిచాటుపిల్లవాడివి. 'ఇల్లు కట్టిచూడు—పెళ్లిచేసి చూడు' అన్నారు పెద్దలు. నీకీరెండూ పట్టించుకోనక్కర్లేదు. మరి నా సంగతి నీకు తెలియనిది ఏముంది ?" అన్నాడు మా నాన్న.

"ఏదన్నా కార్యం తలపెట్టినప్పుడు అది బాగా చెయ్యటం అవసరం. నీకు చెప్పాలిసినవాడిని కాదనుకో—"

"అబ్బాయి, ఇటు చూడు ! స్థళం అంటే చౌకగా దొరికిందికాని తీరా ప్రయత్నం ఆరంభించేటప్పటికి ఎంతైందో తెలుసునా ? ఇంకా పునాదులే తయారుకాలేదు. ఎటుపోయి ఎటు వస్తుందో. మన రాఘవయ్య ముందూ వెనకా చూచుకోకుండా ఇల్లు కట్టి, అది పూర్తిచేసే తాహతు లేక అప్పుతెచ్చి చివరకు దివాలాతియ్యటం మనం ఎరగం ? చివరకు ఆ ఇంట్లో గృహప్రవేశం చేసే గీతకూడా లేకపోయింది

వాడికి. ఇంకా ఎంతో గ్రంథం వుంది." అన్నాడు మా నాన్న.

మా ఇల్లు పూర్తిఅయి గృహప్రవేశం అయింది. చుట్టాలూ, పక్కాలూ, వాళ్లూ వీళ్లూ చాలామంది వచ్చారు. మా నాన్నకు కొంచెం పలుకుబడి బాగానే వుండటంవల్ల పీటలమీదనే చాలా ఖర్చు కలిసివచ్చిందని వినికిడి. మేము ఇల్లు కట్టించుకోవటమేమిటో— దానికి వూళ్లోవాళ్లు డబ్బు ఇచ్చుకోవటమేమిటో! చాలామంది మట్టిగోడలు బాగా లేవు అని చెప్పినట్టు తోస్తుంది. మా నాన్న త్వరలోనే ఆ మట్టి అంతా గీకించి సున్నం పూయించాడు. అప్పటినించీ అది చూడటానికి సున్నంతో కట్టిన ఇల్లుఅల్లేనే వుండేది. అంతటో వూరుకోక పైన చక్కగా సున్నంకూడా కొట్టించాడు.

ఇదంతా నేను చెప్పగా విన్నదే. నా చిన్నతనంలోనే మా నాన్న చనిపోవటంవల్ల ఆయన్ని నేను ఎరగను. "వోరి నువ్వట్రా!" అని మానాన్న పేరుతో నన్ను గుర్తించటంతో చూస్తే ఆయన గొప్పవాడు కామాలు అనుకునేవాడిని. నాకు వడుగు అయింతర్వాతనే మాఅమ్మకూడా మరణించింది.

నా చెల్లెలుకు వివాహం అయి అది అత్తవారింటికి పోయింది. క్రమేపీ నావివాహంకూడా మా అన్నయ్యే చేశాడు. నాభార్య కాపరానికి వచ్చింతర్వాత మేము భాగాలు పంచుకోవటం కొంత గోల జరిగింది. మానాన్నా, అమ్మా లేకపోవటంవల్ల మా భాగాలపంపిణీలో ఇతరులు జోక్యం కలుగచేసుకున్నారు. ఇద్దరన్నదమ్ములు పెద్దవాళ్లయింతర్వాత భాగాలు పంచుకోవటం రివాజు. అసలు మేము అంతవరకూ భాగాలు పంచుకోవటం కొంతమందికి ఆశ్చర్యం కలిగించివుండవచ్చు. తాను పెద్ద అయేదాకా వదినెగారి చేతిల్లో పడే సూటీపోటీ మాటలూ అవీ విషంగా పరిణమించి, సమయంకోసరం కనిపెట్టుకు కూచుంటాడు చిన్నవాడు. నావిషయంలో ప్రత్యేకత నాలోనే వుందో, లేక మావదినెగారిలో వుందో చెప్పలేను. ఆవిడ సూటీపోటీమాటలు అనే రకం కాకపోవచ్చు. నేనూ అవి అర్థంచేసుకునే తెలివితేటలు కలవాడిని కాకపోవచ్చు. ఏమైనా నాభార్య కాపరానికి వచ్చింతర్వాత పరిస్థితులు మారినై.

మొదట్లో నాభార్య సౌమ్యంగా వుండేది. ఎందుకనో దానిలో మార్పువచ్చింది. ఇది కేవలం దాని లోపమే అని అనుకోటానికి వీల్లేదు. అసలు మా మామగారికి మా అన్నదమ్ములం పంచుకుంటే చూడాలని వుండేదిట. ఆయనతోపాటు మాఅన్నయ్య మామగారికికూడా అటువంటి వుద్దేశ్యమే వుండటంవల్ల ఈసమస్య మమ్మల్ని దాటి పెద్దచేతుల్లోకి పోయింది. ఫలితం రోజూ నాభార్య గునియటమూ, విసుక్కోవటమూ. అంతటితో ఆగక నెపం నామీదికి వచ్చింది. కారణం నాభార్యఆత్మకు శాంతిని చేకూర్చటానికి నేను ప్రయత్నించకపోవటం. అది చెప్పేవి సాధారణంగా నాకు అర్థం అయేవి కావు. అర్థం అయిన వాటికి సమాధానం చెప్పే శక్తి నాలోలేదు. చివరకు నేను ఇంత వోబయ్యాని కాకపోతే పంపిణీ ఎప్పుడో జరిగేది అని నాకు తెలిసింది!

అదీకాక మాకు ఇంకో చిక్కు వచ్చిపడింది. మా ఇంటో ఎక్కడ చూచినా చెదలే! ఇవి మొదట మా అన్నయ్యగదిలో మూల బైలుదేరి అక్కడ వున్న జాజిచెక్క పెట్టె అడుగును తినేశినై. వాటిని జాగర్తగా గీకిపారేశాం. తర్వాత పైన మండువాదగ్గిర కనిపించినై. అశ్రద్ధచేశాం. నాభార్యకు వాళ్లమ్మ పెట్టిన పట్టుచీరె దణ్ణెంమీద వున్నది వున్నట్టు చెదలు పట్టింతర్వాత కొంచెం గోల అయింది. ఒకరోజున ఒక మేకును తీసుకుని ఇల్లంతా గాలించాను గీకుతూ. మేము గమనించలేదు కాని అనేకచోట్ల పట్టినై చెదలు. వెల్తురు బాగా లేని మూలల్లో ప్రతిచోటా వున్నయి. వూరగాయజాడీల వెనక తండోపతండాలు. ఒక రోజల్లా శ్రమపడి అన్నింటినీ గీకేశాను. నిచ్చెన వేసుకుని పైన అన్నిచోట్లా దులిపేశాను. కాని ఏమీ లాభంలేకపోయింది. వొళ్లుపులకరించినట్లు మర్నాటికి అన్ని చోట్లా చెదలే! తారు పూయమని చాలామంది సలహా ఇచ్చారు. కొంత తెచ్చి అవి పట్టినచోట్లల్లా

పట్టించాను. అప్పటికి గాని మా ఇంట్లో శాంతి కొంత ఏర్పడలేదు.

అయినా మూడురోజుల ముచ్చటే. చెదలు తాగుపూసిన పైన ప్రదేశంలో మళ్లీ ఆరంభం అయినై. అలమారాలో చెక్కలు పుచ్చిపోయినయ్యనీ, పీటలు చెడిపోయినయ్యనీ, పుస్తకాలు—మా నాన్న పోగు చేసిన అనేక గ్రంథాలు— ఎందుకూ పనికిరాకుండా పోయినయ్యనీ రోజూ వార్తలు! కప్పుకువున్న వెదురు బొంగులు మాకళ్ల ఎదటే పుచ్చి, వాటితాలూకు మట్టి అనేకసార్లు మావిస్తళ్లల్లో పడింది. కప్పువిప్పి అంతా శుభ్రం చెయ్యమని పెద్దవాళ్లు సలహాఇచ్చారు. ఈగోలలో మా భాగాలు పంచుకోవటం కొంచెం వెనకపడింది.

ఒక మంచిరోజు చూచి పెంకులన్నీ విప్పించాము. పెంకులకింద మట్టి పేరుకుని చెదలు విహారం చేస్తున్నై. అనేక బొంగులు ముట్టుకుంటే వూడిపోయినై. ఇంకా మా అదృష్టం బాగుంది కనక మేము త్వరలోనే మేలుకున్నాం. లేకపోతే ఎప్పుడో ఇల్లు విరిగి మామీద కూలేదే. అయితే కప్పు సంపూర్ణంగా తీసెయ్యటంవలన చెదల సమస్య పైభాగంలో వదిలిందికాని గోడలకు ఇంకా బోలెడు తుట్టెలు అలాగే వున్నయి.

“అబ్బాయి, వీటి మూలస్థానం ఎక్కడో వుంటుంది. మీరు పైపైన వీటిని దులపటంవల్ల కించిత్తూ ప్రయోజనం వుండదు. అయినపని అయింది. ఆపుట్టలున్నచోట తీసిపారేయించి మళ్లీ కట్టించండి!” అని వెంకాయమ్మగారు సలహాయిచ్చింది. అది సబబుగా వుంది. అయితే ఒకచోట-పుట్ట వున్నచోట-పలుగుతో ఇటికెల్ని తీసిచూచాం. ఒకఅడుగు మేర ఖాళీ చేశాం. చిత్రమేమిటంటే, చెదలు ప్రతిచోటా గోడలోనించి బైటికి రాలేదుకాని ప్రతిఇటికకూ మధ్య వున్నయి! మేము ఖాళీచేసిన చోట స్పష్టంగా కనిపిస్తూనేవుంది ఇటికల మధ్య అవి ఎలా వున్నదీ. ఇంకోమూల తవ్విచూచాం. అక్కడా అంతే. నాకు అనుమానం పోయి ఏమీ చెదలులేనిచోట పలుగుతో కొన్నిరాళ్లు తీసిచూశాను. చిత్రం! చెదలు పైకి రాలేదుకాని ఇటికలమధ్యగా రాధారులు ఏర్పరుచుకుని తిరుగుతున్నై! వీటి మొదలు ఎక్కడ - వీటిని తీశెయ్యటం ఎలా అనేవాటికి సమాధానం చెప్పటం నావశం కాదు. మాఅన్నయ్య ఇది చూచేటప్పటికి బేజారైపోయినాడు. గోడలన్నీ పరిపూర్ణంగా పడగొట్టి, మళ్లీ ఇల్లు కడితే తప్ప గత్యంతరం లేదని నాకూ, మాఅన్నయ్యకూ అర్థంఅయింది.

ఇంతలో ఇంకో వుపద్రవం వచ్చింది. మా పేటంతా తగలబడిపోయింది. వంటచేసి బైటపడేసిన బొగ్గులలో నిప్పు వుండటంమూలాన ఒక ఇల్లు తడికెలు అంటుకుని ప్రారంభం అయిందనీ, ఎవరో వీథిలో నించి పారేసిన సిగిరెట్టుమూలంగా తగలపడ్డదనీ రకరకాల వదంతులు పుట్టినై. ఏకారణం అయితేనేం మా పేట అంతా తగలబడింది. మా ఇల్లు తగలబడటానికి అనుకూలంగా సామగ్రి లేకపోవటంవల్ల అది తప్పిపోయింది. కాని ఈగోలలో రాత్రిపూట ఇళ్లు తగలబడటంవల్ల బైటపెట్టిన సామాను కొంతమంది ఎత్తుకుపోయినారు. మాబిందె పోయిందంటే మాబట్టలు పోయినై అని వార్తలు. మావదినెగారి బట్టల పెట్టె మొదలైన ఇతరచిల్లరసామగ్రి పోయింది మా ఇల్లు తగలబడకపోయినప్పటికీ! నమ్మండి, నమ్మకపోండి- ఎటు చూచినా మసిబట్టి కప్పులులేని గోడలే మా ఇంటిచుట్టూ! అప్పటినుంచి రాత్రిపూట వంతులు వేసుకుని కాపలాలు కాచాము. వీథివెంట ఎవడన్నా సిగిరెట్టు కాలుస్తూ పోవటం అసంభవం-ఇంకా తగలబడాలిసినదేమీ లేకపోయినప్పటికీ. ఈగోల తెలియక ఎవడో కొత్తగా వచ్చి సిగిరెట్టు గోడపక్కగా పారెయ్యటం జరిగి అది చూచిన నలుగురూ అతన్ని చితకపొడిచారు. అతని నేరం ఏమీ లేకపోయినప్పటికీ అతనికి బాధ తప్పలేదు. తేలుకుట్టిన మర్నాటినించీ చెప్పులు తొడుక్కున్నట్టుగా ప్రవర్తించాం అందరమూ!

వానాకాలం రాకపూర్వమే తాటాకులూ, పెంకులూ తెప్పించి అందరూ కప్పులు వేసుకున్నారు. మా ఇంటిచుట్టూ మళ్లీ ఇళ్లు మామూలుగా తయారై నేత్రానందంగా వుంది. కాని మా ఇంట్లో ఇంకా పరిస్థితులు చెదలరూపకంగానే వుంది. వీటిని దులిపి, మా నాన్న చేసినట్టు మట్టితోకాక మంచి పునాదితో కట్టిన గోడలు అమర్చి, కప్పువేస్తేనేగాని మేము వుండటానికి తగిన ఇల్లు తయారుకాదు. ఇది ఎప్పటికవుతుందని నాప్రశ్న!. ఇది అయితేగాని మేము భాగాలు పంచుకోమా అని మామీద వాత్సల్యం ప్రకటించేవారి ప్రశ్న!